VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 01 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 330

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

**ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు**



2లో

## నేడు చివరిదశ లోక్‌సభ ఎన్నికలు

**ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్**

**వారణాసి నుంచి ప్రధాని మోడీ పోటీ**

**హిమాచల్ నుంచి నటి కంగనా రనౌత్**

### కేసీఆర్‌కు సీఎం రేవంత్

## ఆహ్వానం



**రాష్ట్ర అవతరణ వేడుకలో భాగస్వాములు కావాలని లేఖ**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు రావాల్సిందిగా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ శుక్రవారం కేసీఆర్‌ను కలిశారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి జీఏడీ అధికారులతో కలిసి వెళ్లిన వేణుగోపాల్.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వాన పత్రికను ఇవ్వడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌కు రాసిన లేఖను అందజేశారు. అనంతరం వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్ర అవతరణ

వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం. తెలంగాణ అవతరణ దినోత్సవం అందరికీ పండుగ. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా

ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని కేసీఆర్‌ను కోరాం. ఆయన మా ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు'అని వెల్లడించారు. అయితే ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఈ వేడుకల్లో పాల్గొనేదీ లేనిదీ తెలియదని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

# గొర్రెల పథకం కుంభకోణం రూ.700 కోట్లు!

**గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణం విలువ సుమారు రూ.700 కోట్లు ఉంటుందని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తాజా దర్యాప్తులో బహిర్గతమైంది.**



**ఏసీబీ దర్యాప్తులో బహిర్గతం**

**తాజాగా రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సీఈవో రాంచందర్‌నాయక్ అరెస్ట్**

**తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్ సైతం కటకటాలపాలు**

హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణం విలువ సుమారు రూ.700 కోట్లు ఉంటుందని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తాజా దర్యాప్తులో బహిర్గతమైంది. పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో.. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య పూర్వ ఎండీ రాంచందర్ నాయక్, పశుసంవర్ధకశాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరినీ విచారించిన అనంతరం ఇంత భారీ మొత్తం కుంభకోణం జరిగినట్లు ఏసీబీ అంచనాకు వచ్చింది. తొలుత సుమారు రూ.2.1 కోట్ల నగదు మళ్లించినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో ఇప్పటికే పదిమంది నిందితులను గుర్తించగా, ఆరుగురిని అరెస్టు చేశారు. ఇప్పటిదాకా సంయుక్త సంచాలకులు, సహాయ సంచాలకుల స్థాయి అధికారులు అరెస్టవగా ఏకంగా ఇప్పుడు సీఈవో స్థాయి అధికారి, మాజీ మంత్రి మాజీ ఓఎస్డీ కటకటాలపాలయ్యారు. రాంచందర్ గతంలో పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఏసీబీ దర్యాప్తు నేపథ్యంలో ప్రభుత్వం ఫిబ్రవరిలో ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించి పశు గణాభివృద్ధి సంస్థ సీఈవోగా నియమించింది. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన గొర్రెలకు కేటాయించిన నిధుల్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలతో తొలుత గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అధికారుల ఆమ్యామ్యాల అంశం ముడిపడి ఉండటంతో ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ఆరంభించింది. పశుసంవర్ధకశాఖ అధికారులు మిగతా 2లో

# ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాల్సిందే

**రేవంత్ ఎందుకు తాత్సారం చేస్తున్నారు?**

**పార్లమెంటరీ బోర్డుసభ్యుడు లక్ష్మణ్**

**ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ నిరసన**



**హైదరాబాద్:** గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందని, ఈ కేసులో కీలక వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ తాత్సారం చేస్తోందని ఆరోపించింది. ఈ కుంభకోణంలో దోషులకు శిక్ష పడేవరకు బీజేపీ పోరాటం చేస్తుందని, ఇందుకోసం న్యాయ పోరాటానికి సైతం సిద్ధంగా ఉందని ప్రకటించింది.కేసులో సూత్రధారులు, పాత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినని చెప్పుకున్న రేవంత్ ఇప్పుడెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు.

**కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం ఉందా?**

ట్యాపింగ్ విషయంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ట్యాపింగ్ కేసులో అరెస్టయిన వాళ్లు వాంగ్మూలం ఇచ్చినా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిని అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పదే పదే ప్రస్తావించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం, ధరణి పేరుతో దోచుకున్నదాన్ని కక్కిస్తామన్నారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక కేసీఆర్ అవినీతి, కుంభకోణాల మీద రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లిక్కర్ కేసు నుంచి తన కుమార్తె కవితను తప్పించడంకోసమే బీజేపీ నేతలపై కేసీఆర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.బీఆర్‌ఎస్ రద్దు కోరుతూ లేఖ రాస్తా: కొండా

2017కంటే ముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవహారాలతో పాటు రక్షణ పరమైన ఒప్పందాల్లో నూ కేసీఆర్ వేలు పెట్టాడని తెలుస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో నయీం తరహా పాలన సాగిందని, సొంత కుటుంబం పైన కూడా ఫోన్ ట్యాపింగ్ చేయించారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు.

**రేవంత్‌ను సోనియా బెదిరించారు: బూర**

'బీఆర్‌ఎస్‌పై కేసులు పెడితే నీపని అవుతుంది అని సోనియా గాంధీ బెదిరించారు. అందుకే రేవంత్ రెడ్డి మొహం చిన్నగా చేసుకుని వచ్చాడు' అని బూర నర్సయ్యగౌడ్ వ్యాఖ్యానించారు. ధర్నాలో ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రులు జి.విజయ రామారావు, ఇ.పెద్దిరెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎన్. రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మా రావు, ప్రేంసింగ్ రాథోడ్, భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మేడిగడ్డకు పరీక్షా కాలం

**హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి జరిగిన నష్టంపై పూర్తిస్థాయి అంచనాకు రావడానికి మరింత సమయం పట్టేలా ఉంది. వర్షాకాలంలో వచ్చే వరద పూర్తిగా దిగువకు వెళ్లిపోయేలా గేట్లన్నీ ఎత్తినా... బ్యారేజీకి చేపట్టిన తాత్కాలిక మరమ్మతులను ప్రాణహిత నుంచి ప్రవాహాలు మొదలయ్యేలోగా పూర్తి చేయడం కష్టం కానుంది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) మధ్యంతర నివేదిక సిఫార్సుల ప్రకారం మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఇన్వెస్టిగేషన్లు(పరీక్షలు) చేయడానికి నాలుగైదు నెలల సమయం పట్టనుంది. క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే ఎన్డీఎస్ఏ పూర్తిస్థాయి నివేదిక ఇస్తుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొంటే వచ్చే వర్షాకాలంలో మేడిగడ్డ వినియోగంలోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

**నవంబరు తరువాతనే నివేదికలు**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించి, సంబంధిత ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలతో చర్చించిన ఎన్డీఎస్ఏ ఇచ్చిన మధ్యంతర నివేదిక ఇచ్చింది. సీడబ్ల్యూపీఆర్‌ఎస్, సీఎస్ఎంఆర్‌ఎస్, ఎన్‌జీఆర్ఐ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలతో వివిధ పరీక్షలు చేయించాలని సిఫార్సు చేసింది. అందులో భాగంగా మే 22, 23 తేదీల్లో పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చి స్టేషన్(సీడబ్ల్యూపీఆర్‌ఎస్)కు చెందిన ముగ్గురు నిపుణుల బృందం మూడు బ్యారేజీలను పరిశీలించి... ఏయే పరీక్షలు చేయాలో నిర్ణయించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఈఎన్సీ(జనరల్) అనిల్‌కుమార్‌కు సీడబ్ల్యూపీఆర్‌ఎస్ లేఖ రాసింది.



**కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి జరిగిన నష్టంపై పూర్తిస్థాయి అంచనాకు రావడానికి మరింత సమయం పట్టేలా ఉంది.**

# చిన్నారులను కిడ్నాప్ చేసి అమ్మకం

**ముగ్గురు సభ్యుల ముఠాను పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్:** చిన్నారులను కిడ్నాప్ చేసి విక్రయించేందుకు ప్రయత్నించిన ముగ్గురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ దారుణమైన సంఘటన సైబరాబాద్

కమిషనరేట్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కేసు వివరాలను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వెల్లడించారు. కర్నూలు ప్రాంతానికి చెందిన చిన్న, లక్ష్మి అనే దంపతులు చిన్న చిన్న పనులు చేస్తూ శంషాబాద్ పట్టణంలోని ఫ్లై ఓవర్ కింద నిద్రిస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే క్రమంలో ఈ నెల 27వ తేదీన తన ఇద్దరు కూతుళ్లతో కలిసి నిద్రపోతున్న సమయంలో.. ముగ్గురు దండు హనుమంతు, దండు చందన, భంగపతి స్వాతిలు కలిసి చిన్న, లక్ష్మితో నిద్రిస్తున్న ఒక నెల కూతురును తీసుకుని పరారయ్యారు. అయితే ఉదయం లేచి చూసేసరికి చిన్నారి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆర్జీఐఏ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు



ఆధారంగా నిందితులను గుర్తించారు. నిందితులు దండు హనుమంతు, దండు చందన, భంగపతి స్వాతిలను సిద్ధాంతి వద్ద గుర్తించి వారి వద్ద ఉన్న చిన్నారిని క్షేమంగా పట్టుకున్నారు.

నిందితులు రాజేంద్రనగర్ మైలార్ దేవ్ పల్లికి చెందిన వారుగా గుర్తించారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మద్యం సేవించి చిన్నారులను కిడ్నాప్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుని విలాసాలకు పాల్పడుతున్నట్లు డీసీపీ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

చిన్నారిని తల్లిదండ్రుల

చెంతకు క్షేమంగా చేర్చిన అధికారులను డీసీపీ నారాయణరెడ్డి ప్రశంసించారు.

# ఢిల్లీలో నీటి సంక్షోభం..

**నీటిపై పడిన ఎండల ప్రభావం**

**నీటి చుక్కను ఒడిసి పట్టుకోవడానికి నానాప్రయత్నాలు**

**వాటర్ ట్యాంకులపై ఎగబడుతున్న జనం**

**సుప్రీంకోర్టు తలుపు తట్టిన కేజ్రీవాల్ సర్కార్**

**హర్యానా, యూపీ ప్రభుత్వాలు నుండి అదనపు నీళ్లకై ప్రయత్నం**

**చేతులు జోడించి ఇరురాష్ట్రాలకు సీఎం అభ్యర్థన**

2లో




## తెలంగాణలో మండిపోతున్న ఎండలు 47 డిగ్రీలకు పైనే నమోదు

**హైదరాబాద్:** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఒకవైపు మాడు పగిలే ఎండ, వడగాల్పులు.. మరోవైపు చెమటలు కారేలా ఉక్కపోతతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి రాష్ట్రంలో ఎండలు భగ్గుమంటున్నాయి. రికార్డు స్థాయిలో పగటిపూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. దీంతో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పగటి పూట జన సంచారం తగ్గింది. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. పగటి పూట బయటకు రావాల్సి వస్తే.. వడదెబ్బకు గురి కాకుండా కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మంచిర్యాల జిల్లా భీమారంలో, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 47.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెలపాడు, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 46.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నల్గొండ జిల్లా కేతెపల్లి, ఖమ్మం జిల్లా ఖానాపూర్ హవేలీలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా బుట్టాపూర్‌లో 46, ఆదిలాబాద్ జిల్లా అర్లీ టీలో 45.7, కొమురం భీం జిల్లా కుంచవెల్లి లో 45.9 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జనాలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జగిత్యాల జిల్లాలో భానుడి ప్రతాపానికి 20 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో గల ద్విచక్ర వాహన మెకానిక్ అన్వేష్‌కు సంబంధించిన ఇంటి ఆవరణలో ఎండ వేడితో దాదాపుగా 20 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం కాగా.. ద్విచక్ర వాహనాలతో పాటు ఇంటిలోని సామాగ్రి మంటల్లో కాలిపోయింది. సుమారు పది లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు అన్వేష్ వేడుకుంటున్నారు.

## ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

### ప్రత్యేక విమానంలో వంద టన్నుల బంగారం రాక
### భారీ బందోబస్తు మధ్య తరలించిన ఆర్‌బిఐ

**ముంబయి:** ఇంగ్లాండ్ నుంచి భారీఎత్తున బంగారం నిల్వలను ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100 టన్నులు అంటే లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. అప్పట్లో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సివచ్చింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పుర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర రిజర్వ్ బ్యాంకు పెద్దఎత్తున

బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ సైతం అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసేనాటికి ఆర్‌బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వా చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్‌బిఐ గత ఏడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ ఏడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి- ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలు చేయడం గమనార్హం. రవాణా, భద్రత విషయాలను పరిగణనలోకి తీసుకుంటే 100 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించడం మామూలు విషయం కాదు. దీనివెనక కొన్ని నెలల కసరత్తు అవసరం. ఆర్‌బీఐ, ఆర్థికశాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమగ్ర సమన్వయం ఉండాలి. ఈ బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు తొలుత ఆర్థికశాఖ నుంచి ఆర్‌బీఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు తీసుకుంది. సాధారణంగా అన్ని దిగుమతులపై వర్తించే ఐజీఎస్టీ మాత్రం తప్పలేదు. తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోవాల్సి ఉండటమే దీనికి కారణం. ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఉపయోగించారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా తరలింపుతో ఆర్‌బీఐ నిర్వహణ వ్యయాలు స్వల్ప స్థాయిలో తగ్గుతాయి. ఇప్పటి వరకు బంగారం నిల్వ చేసినందుకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెల్లిస్తూ వచ్చిన రుసుము ఇకపై చెల్లించనక్కరలేదు.

## నేడు చివరిదశ లోక్‌సభ ఎన్నికలు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ తుదిదశ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. వారణాసి నుంచి ఆయన మూడోసారి పోటీ చేస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు ఈ ఏడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మూడో సారి వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు.పంజాబ్ లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ లో నాలుగు స్థానాలకు, ఉత్తర్ ప్రదేశ్

లోని 13 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ లోని తొమ్మిది స్థానాలకు, బీహార్ లోని ఎనిమిది స్థానాలకు, ఒడిశాలోని ఆరు స్థానాలకు, ఝార్ఖండ్ లోని మూడు సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి పోటీలో ఉన్న ప్రముఖులలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, లాలూ ప్రసాద్ కూతురు మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నది.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలు జూన్ 1న సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు. దీంతో ఇప్పటికే డేటాతో సిద్ధంగా ఉన్న పలు సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

## ఢిల్లీలో నీటి సంక్షోభం..

**న్యూఢిల్లీ:** నీటి కోసం యుద్ధాలు మొదలవుతున్నాయా? భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు తప్పవని చాలా మంది మేధావులు చెప్పారు. ఇప్పటికే ఆఫ్రికాను వాటర్ క్రైసిస్ వెంటాడుతోంది. ఇదంతా ఇప్పట్లో కాదని దేశంలోని పలు ప్రభుత్వాలు లైట్‌గా తీసుకున్నాయి. మేధావులు చేసిన హెచ్చరికలను పెద్దగా పట్టించుకోలేదు. దాని ఫలితమే.. నిన్న కోల్‌కత్తా, బెంగళూరు.. నేడు ఢిల్లీ. ఉత్తరాదిలో ఈసారి ఎండలు ఠాకెత్తించాయి. ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 45 డిగ్రీల పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంటే పరిస్థితి ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతుంది. రోడ్డు మీదకు ప్రజల రాలేక నానావస్థలు పడ్డారు. ఎండల ప్రభావం నీటిపై పడింది. దేశ రాజధాని ఢిల్లీలో నీటి కొరత తీవ్రమైంది. వీధుల్లోకి వాటర్ ట్యాంకులు వస్తే చాలు నీటి చుక్కను ఒడిసి పట్టుకోవడానికి నానాప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమయంలో ప్రజలు కొట్టుకుంటున్న సందర్భాలు లేక పోలేదు. ప్రస్తుతం ఢిల్లీ అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. పరిస్థితి గమనించిన ఆప్ సర్కార్, నీటి వృధాను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వాహనాలు కడిగితే భారీ మొత్తం జరిమానా వేసేందుకు వెనుకాడలేదు. నీటిని వాణిజ్యం కోసం ఉపయోగించే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ముఖ్యంగా నిర్మాణాలు జరిగే ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు వంటి ప్రాంతాల్లో అక్రమంగా ఉన్న నీటి కనెక్షన్లను నిలిపివేయాలని ఢిల్లీ మంత్రి అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత కారణంగా ఢిల్లీకి హర్యానా నుంచి రావాల్సిన నీటి సరఫరా ఆగిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నమాట. ఢిల్లీలో తలెత్తిన నీటి సంక్షోభంపై కేజ్రీవాల్ సర్కార్ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. హర్యానా, యూపీ ప్రభుత్వాలు తమకు అదనపు నీళ్లు కేటాయించేలా ఆదేశాలివ్వాలని అందులో ప్రస్తావించింది. మరోవైపు ప్రస్తుత పరిస్థితిపై సీఎం కేజ్రీవాల్ రియార్ట్ అయ్యారు. ఎండల కారణంగా ఢిల్లీలో విద్యుత్ వినియోగం పెరిగిందని, అయినా ఎక్కడా కొరత లేదన్నారు. అధిక ఎండల కారణంగా నిటి వినియోగం పెరిగింది. సరిహద్దు రాష్ట్రాల నుంచి ఢిల్లీకి రావాల్సిన నీటి సరఫరా తగ్గిపోయింది. దీనిపై అందరూ కలిసి నీటి సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపు ఇచ్చారు. రాజకీయాలు పక్కనబెట్టి నీటి సమస్య నుంచి ఢిల్లీ ప్రజలకు ఉపశమనం కలిగించాలని చేతులు జోడించి కోరారు. అందరం కలిసి పనిచేస్తే హస్తిన వాసుల కష్టాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత ఏప్రిల్ నెలలో బెంగుళూరు, కోల్‌కత్తాలో ఇదే పరిస్థితి నెలకొంది. కాస్త వర్షాలు పడడంతో కొంత ఉపశమనం కలిగింది.

# గొర్రెల పథకం కుంభకోణం
# రూ.700 కోట్లు!

తెలంగాణలోని లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి.. అక్కడి విక్రయదారుల నుంచి గొర్రెలను కొనుగోలు చేయించారు. విక్రేతలకు చెల్లించాల్సిన డబ్బులను బినామీ ఖాతాలకు మళ్లించారు. బ్రోకర్లను, ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని రూ.2.1 కోట్లను మళ్లించినట్లు తేలడంతో ఆ నిధులు ఏమయ్యాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేసింది. బినామీ ఖాతాదారులను విచారించగా బ్రోకర్లు, అధికారుల పాత్రపై ఆధారాలు లభించాయి. ఈ కుంభకోణంలో గొర్రెల కొనుగోలు కాంట్రాక్టరుగా వ్యవహరించిన మొయినుద్దీన్ కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అరెస్టు చేసేలోగానే అతడు దుబాయ్‌కి పారిపోయాడు. ఇప్పటికే అరెస్ట్ చేసిన వారి నుంచి సేకరించిన సమాచారం, రికార్డుల ఆధారంగా రాంచందర్, కల్యాణ్‌ల పాత్ర తేటతెల్లమైంది. బ్రోకర్లు, ప్రైవేటు వ్యక్తుల సహకారంతోనే గొర్రెలు కొనాలని వీరిద్దరూ రాష్ట్రవ్యాప్తంగా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులకు, ఇతర అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడైంది. దీంతో వీరిని శుక్రవారం అరెస్ట్ చేసి నాంపల్లి




ఏసీబీ కేసుల న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం వీరికి 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు2015లో పథకం ప్రారంభం...

2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర ఉన్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది. రాంచందర్, కళ్యాణ్‌ను న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించింది. త్వరలోనే మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలున్నాయి.

**అడ్డగింతలు.. హైడ్రామాల మధ్య**

నిధుల దుర్వినియోగంలో రాంచందర్ ప్రమేయంపై ఆధారాలు లభ్యమైన నేపథ్యంలో ఆయన్ను అరెస్ట్ చేసేందుకు ఏసీబీ అధికారులు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లారు. తమ వెంట రావాలని నిర్దేశించగా తొలుత ఆయన అంగీకరించలేదు. అరెస్ట్ మెమో చూపించినా ససేమిరా అనడంతో చివరకు బలవంతంగా తీసుకెళ్లాల్సి వచ్చింది. కొందరు సిబ్బంది సైతం ఏసీబీ అధికారులకు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. అయితే ఏసీబీ అధికారులు తీవ్రస్థాయిలో హెచ్చరించి రాంచందర్‌ను అరెస్ట్ చేశారు.

## ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

**అమరావతి:** కౌంట్‌డౌన్ మొదలయ్యింది. 4న ఫలితాల లెక్కింపుపైనే ప్రజలంతా ఆసక్తిగా ఉన్నారు. రాజకీయా నాయకులు మాత్రం నరాలు తెగే ఉత్కంఠలో ఉన్నారు. యావత్తు దేశం ఏపీ ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గతంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఓట్ల లెక్కింపు జూన్ 4న మొదలుకానుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఓట్లలెక్కింపు ఎలా సాగుతుంది. ఏయే ఫలితాలు ఎప్పుడొస్తాయన్నది ఆసక్తిగా మారింది. గతంలో ఎప్పుడూ లేనంతగా పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకే అనుకూలమని నిర్ణయించుకున్నారు. సిఎంజగన్ మరోమారు అధికారం చేపడతారని, 9న విశాఖలో ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రకటించారు. ఈ క్రమంలో ఇటీవలి ఎన్నికల హింస నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు పక్రియ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఉదయం 4 గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 5 గంటలకు వారికి ఏయే టేబుళ్లు కేటాయించారన్న సమాచారం అందిస్తారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుండగా.... తొలుత ఆర్మీ సర్వీస్ ఉద్యోగుల ఓట్లు ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి అరగంట సమయం పట్టనుంది. ఆ తర్వాత ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ను తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లను సిద్ధం చేశారు. పోలింగ్ బూత్ సీరియల్ నెంబర్ల ఆధారంగా వరుస క్రమంలో ఈవీఎంలు తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. అంటే 14 టేబుళ్లపై తొలుత 1 నుంచి 14 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు. అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో వాటిని తెరిచి లెక్కించనున్నారు. దీంతో తొలి రౌండ్ పూర్తవుతుంద న్నమాట... ఆ తర్వాత రెండో రౌండ్‌లో 15 నుంచి 29 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు.

ఈ విధంగా ఒక్కో రౌండ్ పూర్తి చేసుకుంటూ వెళ్లనున్నారు. ఏదైనా ఈవీఎంలో సమస్య తలెత్తినప్పుడు ఆ పోలింగ్ బూత్ ఈవీఎం పక్కనపెట్టి ఆ తర్వాత వరుస సంఖ్యలో ఉన్న బూత్ నుంచి లెక్కించుకుంటూ వెళ్తారు. పక్కన పెట్టేసిన ఈవీఎంను చివరిలో మరోసారి చెక్ చేయనున్నారు. అప్పటికీ వీలుకాకుంటే ఆ పోలింగ్ బూత్‌లోని వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించి వాటినే ఓట్లుగా పరిగణించనున్నారు. అలాగే ఈవీఎంల లెక్కింపు పూర్తయినా తుది ఫలితాలు ప్రకటించరు. పోలింగ్ బూత్‌ల సీరియల్ నెంబర్లన్నీ చిట్‌లపై రాసి ఓ బాక్స్‌లో వేయనున్నారు. లాటరీ ద్వారా ఐదు పోలింగ్ కేంద్రాలను ఎన్నుకుని వాటి వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించనున్నారు. ఈవీఎంల్లో వచ్చిన ఓట్లకు, వీవీప్యాట్ ఓట్లకు సరిపోలితే సరి లేకుంటే మూడుసార్లు లెక్కించనున్నారు. ఈ మూడుసార్లు కూడా రెండు ఫలితాలు సరిపోకపోతే....వీవీపీ ప్యాట్ స్లిప్‌లనే అసలైన ఓట్లుగా భావించి వాటినే పరిగణలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో అత్యధికంగా 111 నియోజకవర్గాల్లో 20కంటే తక్కువ రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటల్లోగా పూర్తిచేయనున్నారు. మరో 60 నియోజకవర్గాల్లో 21 నుంచి 25 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఫలితాలు సాయంత్రానికి అందుబాటులోకి రానున్నాయి. మరో 4 నియోజకవర్గాలు మాత్రమే రాత్రి వరకు లెక్కింపు సాగనుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 9 గంటల కల్లా మొత్తం పక్రియ ముగించేలా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఉదయం 11 గంటల కల్లా ఫలితాల ట్రెండ్ వెలువడే అవకాశం ఉంది. అయితే తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురంలో వెలువడనుంది. ఎందుకంటే ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 13 రౌండ్లు మాత్రమే ఉన్నాయి. కాబట్టి అన్నిటికన్నా ముందు ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు వెలువడనున్నాయి. ఒక్కో రౌండు పూర్తవడానికి గరిష్ఠంగా 20 నిమిషాల నుంచి 30 నిమిషాల లోపు మాత్రమే పట్టే అవకాశం ఉంది.

## జయజయహే గీతం ఆమోదించడం హర్షణీయం


**ఎపిలో జగన్ అధికారంలోకి రావడం కల్ల: నారాయణ**

**హైదరాబాద్:** జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా రూపొందించడం అభినందనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అయితే రాష్ట్ర చిహ్నం మార్చక పోవడమే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర చిహ్నం జోలికి వెళ్లకుండా.. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర గీతం కంపోజ్ చేయానికి కీరవాణిని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడితే తప్పేంటని ప్రశ్నించారు. కళలకు ప్రాంతీయ భేదాలు ఉండవని.. హద్దులు గీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ధ్యానం చేయడమంటే కన్యాకుమారిని కలుషితం చేయడమే అని విమర్శించారు.ఏపీ పాలిటిక్స్‌పై కూడా సీపీఐ నారాయణ స్పందించారు. ఏపీలో వైసీపీ గెలిచే అవకాశాలు లేవని జోస్యం చెప్పారు. కావాలనే విశాఖలో ప్రమాణస్వీకారం అంటూ వైసీపీ నేతలు హడావుడి చేస్తున్నారని అన్నారు. కౌంటింగ్ గురించి కూడా వైసీపీ నేతలు రెచ్చగట్టే మాటలు మాట్లాడుతున్నారని.. దాన్ని బట్టే వైసీపీ ఓడిపోతుందని తెలుస్తోందని తెలిపారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి రాకపోతే టీడీపీ అధినేత చంద్రబాబు ఇండియా కూటమితో జత కట్టాలని కోరుకుంటున్నా అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఐదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం

### సీనియర్ ఐపిఎస్ ఎబివికి ఎట్టకేలకు పోస్టింగ్
### ఉదయం జాయినింగ్..సాయంత్రం రిటైర్‌మెంట్

**అమరావతి:** ఎట్టకేలకు ఐదేళ్ల వేధింపుల తరవాత..సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావుకు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఆయనను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్ట్ ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఉదయం వెంకటేశ్వర రావుపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు మొదటిసారి సస్పెన్షన్ ఎత్తివేసి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అప్పుడు కూడా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా పోస్టింగ్ ఇచ్చింది. మళ్ళీ ఇప్పుడు కూడా అదే పోస్టింగ్ ఇచ్చింది.ఈ క్రమంలో ఏబీ వెంకటేశ్వరరావు ఛార్జ్ తీసుకున్నారు. తిరిగి సాయంత్రం పదవీ విరమణ చేయనున్నారు. ఐదేళ్ల క్రితం జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చీ రాగానే.. ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం కక్ష గట్టింది. ఆ వెంటనే ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అప్పుడు వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలంటే ఏపీ ప్రభుత్వానికి క్యాట్ సూచించింది. దీనిపై జగన్ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే క్యాట్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అలా ఐదేళ్లుగా ఏబీ వెంకటేశ్వరరావు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. ఆయన పోరాటం ఫలించి.. పదవీ విరమణ రోజు విధుల్లో చేరారు. ఈ క్రమంలో జగన్ జగన్ సర్కార్ అనుకున్న విధంగానే ఐదేళ్లు ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు.



# పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మే 31**

మండలంలోని క్యాసంపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించి పురోగతిపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న టాయిలెట్స్ ఎలక్ట్రిసిటీ ప్లంబింగ్ పనులను పరిశీలించి రెండు రోజులలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ సువిశాలంగా ఉన్నందున రాబోయే మూడు, నాలుగు రోజులలో యువత భాగస్వామ్యంతో శ్రమదానం, మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, ఎంపీడీవో నాగ వర్ధన్, ఎంపీవో మలహరి, ఎంఈఓ ఎల్లయ్య, పంచాయతీ రాజ్ ఏఈ ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తన దుకాణాలను కలెక్టర్ తనిఖీ.

## స్టాక్ నిల్వలలో తేడా కలిగిన దుకాణ డీలర్ పై కేసు నమోదు.

## నిరంతర తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 31:**

జిల్లాలోని బోధన్ పట్టణంలో గల ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలలో తేడా, ఇతర వివరాల నమోదులో లోటుపాట్లు కలిగిన ఓ దుకాణ డీలర్ పై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ అధికారులను సమన్వయము చేసుకుని రెండు రోజుల్లోపు అన్ని దుకాణాలలో క్షుణ్ణంగా తనిఖీలు పూర్తిచేసి తనకు నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ ముందుగా బోధన్ పట్టణం అంబెడ్కర్ చౌరస్తాలో గల ఏ.వీ.నారాయణ రావు అండ్ కంపెనీ ఎరువులు, విత్తనాల షాపును తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్ లను, విత్తన బస్తాలపై లాట్ నంబర్, ఎం.ఆర్.పీ రేటు, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి, దుకాణదారులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం శ్రీనివాస్ అండ్ కంపెనీ విత్తన, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ లో, ఈ-పాస్ నమోదు వివరాలలో తేడా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్, ఈ విషయమై డీలర్ ను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేకపోయింది. అంతేకాకుండా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ లో వివరాల నమోదులోనూ లోటుపాట్లు ఉండడాన్ని గమనించిన కలెక్టర్, శ్రీనివాస్ అండ్ కంపెనీ దుకాణంపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలను ఎంతమాత్రం సహించేది లేదని, రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా విత్తన అభివృద్ధి సంస్థ అధికారి శ్రీకర్, ఇంచార్జి ఏడీఏ సంతోష్ తదితరులు ఉన్నారు.

### పాఠశాలల్లో ప్రగతి పనుల పరిశీలన

కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఏ.ఆర్.పీ క్యాంప్ లోని ప్రైమరీ స్కూల్, బోధన్ పట్టణం బురుడ్ గల్లీ లో గల ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించి, ఆయా దశలలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు సూచించారు. అత్యవసర పనులను గుర్తిస్తూ, యుద్ధప్రాతిపదికన వాటిని పూర్తి చేయించాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులను, వాటి పరిసరాలను శుభ్రం చేయించాలని అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా, వర్షపు జలాలు, మురుగు నీరు పాఠశాల ఆవరణలో నిలువ ఉండకుండా ముందస్తుగానే జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.దుర్గాప్రసాద్, ఈ.ఈ దేవిదాస్ తదితరులు ఉన్నారు.



# మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా ఉర్దొండ వనిత ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 31:**



మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 15 న వైస్ చైర్ పర్సన్ ఇందుప్రియ చైర్ పర్సన్ గా ఎన్నికైన నేపథ్యంలో ఖాళీ అయిన వైస్ చైర్ పర్సన్ పోస్టుకు ఎన్నికలు నిర్వహించుటకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ఖరారు చేయగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆథరైజ్డ్ అధికారికి ఆర్డీఓ రంగనాథ్ ను నియమించింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్.డి.ఓ. రంగనాథ్ రావు అధ్యక్షతన నూతన వైస్ చైర్ పర్సన్ కొరకు జరిగిన మునిసిపల్ ప్రత్యేక సమావేశంలో 10 వ వార్డుకు చెందిన ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికైందని ఆర్.డి.ఓ. ప్రకటించారు. కామారెడ్డి పట్టణంలో 49 మునిసిపల్ వార్డులు, ఒక ఎక్స్- అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యే తో కలిపి మొత్తం 50 మంది సభ్యులకు గాను కోరం కు 26 మంది సభ్యులు కావలసి ఉండగా 30 మంది కౌన్సిలర్లు హాజరయ్యారని ఆయన తెలిపారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుండి సీల్డ్ కవర్ లో ఉర్దొండ వనిత పేరు వచ్చిందని, వైస్ ఛైర్పర్సన్ పోటీకి ఎవరు లేనందున ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ డిక్లరేషన్ ఇచ్చిన అనంతరం ప్రమాణం చేయించారు. వనిత దైవం మీద ప్రమాణం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ సుజాత, మునిసిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# "బీడీ టేకేదార్ల" చర్చలు సఫలం.

## వెయ్యి బీడీలకు రూ" 4.50 పైసలు కమిషన్ పెంపు.

## ఐక్య పోరాటం ఫలించింది.

## తెలంగాణ బహుళజన బీడీ టేకేదార్ యూనియన్ గౌరవ అధ్యక్షులు యస్. సిద్దిరాములు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 31**



బీడి పరిశ్రమలో పనిచేస్తున్న టేకేదార్లకు కమీషన్ రేటు పెంపుదలపై శుక్రవారం కంపనీ యాజమాన్యాలతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. నగరంలోని ప్రైవేట్ హెూటల్లో బీడి టేకేదార్ల యూనియన్, కంపనీ యాజమాన్యాల మధ్య సుమారు నాలుగు గంటల పాటు చర్చలు జరిగాయి. చర్చల్లో ప్రస్తుతం అమలవుతున్న కమీషన్ పై రూ" 4.50 పైసలు పెంపుకు యాజమాన్యాలు అంగీకరించాయి. ఈ చర్చల్లో బీడీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, దేశాయి బీడీ కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ రస్మీకాంత్, టేలిఫోన్ కంపెనీ జనరల్ మేనేజర్ రమన్ బాయి, చారుబాయి బీడీ కంపెనీ పూర్ణచంద్రరావు పాల్గొగా ఆయా ట్రేడ్ యూనియన్ ల నాయకులు పాల్గొన్నారు. టేకేదార్ల ఐక్య పోరాటం వల్లే కమీషన్ రేటు వెయ్యి బీడిలకు రూ" 4.50 పైసలు పెరిగాయని తెలంగాణ బహుళజన బీడీ టేకేదార్ యూనియన్ (బిఎల్ టీయూ)గౌరవ అధ్యక్షులు యస్. సిద్దిరాములు అన్నారు. పెరిగిన కమీషన్ ఏప్రిల్ నెల నుండి అమలుకు యాజమాన్యాలు అంగీకరించినట్టు తెలిపారు. ఈ చర్చల్లో తెలంగాణ బహుళజన బీడీ టేకేదార్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు యం. సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి గౌడ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు యం. బాస్కర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాజు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు దినేష్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ఏటా 31న నో స్మోకింగ్ డే

**విజయవాడ:** ఫ్యాషన్ ముసుగులో భావిభారతం పొగచూరుతోంది. ప్రపంచ వ్యాప్తంగా జనాన్ని నిర్వీర్యం చేసే అంశాల్లో పొగాకు వాడకం ఒకటి. ఈ మహమ్మారి ఏటా కొన్ని లక్షల మంది జీవితాలను కబళిస్తుంది. అయినా మన దేశంలో పొగాకును పూర్తిగా నిషేధించే పరిస్థితులు లేవు. పొగాకు వాడకం మీద ప్రజల్లో చైతన్యం తీసుకురావడం తప్ప మరే మార్గం లేదంటారు విశ్లేషకులు. అభివృద్ధి చెందిన దేశాలలో పొగత్రాగేవారి సంఖ్య స్థిరంగా ఉండగా అభివృద్ధి చెందుతున్న మనదేశంలో వీరి శాతం రోజురోజుకీ గణనీయంగా పెరుగుతోంది. అమెరికాలోని వ్యాధి నిరోధక ,నియంత్రణ కేంద్రం పొగాకు వినియోగాన్ని నిరోధించగలిగే వ్యాధి కారకాలలో ప్రధానమైనదిగా, ప్రపంచవ్యాప్తంగా సంభవించే అకాల మరణాలకు ముఖ్యమైన కారణంగా పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987 మే 15న ఒక తీర్మానాన్ని ఆమోదించింది, ఏప్రిల్ 7, 1988న మొదటి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా ఉండాలని పిలుపునిచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 40వ వార్షికోత్సవం కావడంతో ఈ తేదీని ఎంచుకున్నారు. ఆ తర్వాత 1989 మే 17న ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31ను వార్షికంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా పిలవాలని పిలుపునిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1989 నుండి మే 31న ప్రతి సంవత్సరం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటారు. పొగాకు కొన్ని




వందల రకాల హానికర రసాయనాలతో కూడుకున్నదే కాక నికోటిన్, బూడిద, అధికంగా అనర్థాలకు గురి చేసే కార్బన్ మోనాక్సైడ్ దీనిలో ఎక్కువగా ఉంటాయి. పొగాకు ఊపిరితిత్తులను విపరీతంగా ప్రభావితంచేస్తాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మాత్రమేకాకుండా, శరీరంలోని అన్ని అవయవాలను క్రమంగా నాశనం చేస్తుంది. పొగాకు వినియోగం వలన కలిగే నష్టాలలో ముఖ్యమైనవి ఊపిరితిత్తుల కాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు. అంతేకాకుండా ధూమపానం వల్ల నంపుసకత్వం వస్తుందని తాజా పరిశోధనలు వెల్లడించాయి. సహజంగా పురుషులలో ధూమపానం ఎక్కువగా ఉన్నా యుక్త వయస్కులలో ఈ లింగభేదం ఎక్కువగా లేకపోవడం గమనార్హం.ప్రతి సంవత్సరం ఈ రోజున ప్రపంచ మంతటా 'నో స్మోకింగ్ డే' నిర్వహించడం ఆనవాయితీగా మారింది. పొగాకు రాహిత సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 18 సంవత్సరాల వయస్సులోపువారికి పొగాకు ఉత్పత్తులు అమ్మడం ప్రభుత్వం నిషేధించింది. సిగరెట్ అండ్ అదర్ టబాకో ప్రోడక్ట్స్ యాక్ట్ లోని సెక్షన్ 4 బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయకూడదని స్పష్టం చేస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడం తద్వారా పొగతాగే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సి ఉంది.




# కోట కోచింగ్‌లపై మరో సీరిస్

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా వచ్చిన వెబ్ సిరీస్‌లలో ప్రేక్షకుల మనసు గెలుచుకున్న సిరీస్ 'కోట ఫ్యాక్టరీ'. ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటాలో ఉన్న విద్యార్థుల జీవితాల ఆధారంగా వచ్చిన ఈ వెబ్ సిరీస్ విడుదలైన నాటి నుంచే మంచి టాక్ తెచ్చుకుంది. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి రెండు సీజన్‌లు విడుదల కాగా తాజాగా మూడో సీజన్ అనౌన్స్‌మెంట్ ఇచ్చింది నెట్‌ఫ్లిక్స్. 'కోట ఫ్యాక్టరీ' 3వ సీజన్ 20 జూన్ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. ఇక పంచాయత్ వెబ్ సిరీస్ ఫేమ్ జితేంద్ర కుమార్ ఇందులో టీచర్‌గా నటించగా.. వైభవ్(మయూర్ మోర్) లీడ్ రోల్‌లో నటించాడు. ఐఐటీలో సీటు కోసం కోటా లో వైభవ్(మయూర్ మోర్) పడిన ఇబ్బందులను ఆధారంగా ఈ వెబ్ సిరీస్ వచ్చింది. సౌరభ్ కన్నా రూపొందించిన ఈ వెబ్ సిరీస్‌కు రాఘవ్ సుబ్బు దర్శకత్వం వహించారు. ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# పవన్ కాల్‌షీట్ల కోసం ఎదురుచూపు

### హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తికి కసరత్తు

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో పెట్టాడని తెలిసిందే. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమాల్లో ఒకటి హరిహర వీరమల్లు . పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ఇప్పటికే నిర్మాత ఏఎం రత్నం చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇటీవలే ఏపీ ఎన్నికల షెడ్యూల్ ముగియడంతో పవన్ కల్యాణ్ ఎప్పుడెప్పుడు షూటింగ్ అప్‌డేట్ ఇస్తాడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. వారి కోసం నెట్టింట ఇంట్రెస్టింగ్ న్యూస్ హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ షూటింగ్‌ను జూన్ 15 నుంచి షురూ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ షూటింగ్ మొదలైన వారం తర్వాత చిత్రీకరణలో పాల్గొనబోతున్నాడని సమాచారం. ఈ సినిమాను సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన హరిహరవీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచుతున్నాయి. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏ దయాకర్ రావు నిర్మిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం హరిహరవీరమల్లు అండ్ టీంపై వచ్చే హై ఆక్టేన్ యాక్షన్ సీన్లను ఇప్పటికే రామోజీఫిలింసిటీలో చిత్రీకరించారు. పవన్ కల్యాణ్ మరోవైపు ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో కూడా నటిస్తున్నాడు.

# తండ్రిని తలచుకుంటూ..మహేశ్ ఎమోషనల్ పోస్ట్



తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన నటుడు కృష్ణ. అర్ధ శతాబ్దం పాటు తన సత్తా చాటిన ఈ లెజెండరీ నటుడి జయంతి నేడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు, అభిమానులు ఆయన్ని గుర్తుచేసుకుంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇక తన తండ్రిని తలచుకుంటూ మహేశ్ బాబు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. మిమ్మల్ని ప్రతి క్షణం మిస్ అవుతున్నాను. నా ప్రతి జ్ఞాపకంలోనూ మీరు ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ కృష్ణ యంగ్ లుక్‌లో ఉన్నప్పటి ఫొటోను మహేశ్‌బాబు పంచుకున్నారు. హీరో సుధీర్ బాబు కూడా కృష్ణను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే మామయ్య. మీ పక్కన కూర్చొని 'హరోం హర' చూడాలనుంది. నేను ఇలాంటి యాక్షన్ సినిమాలో నటించాలని మీరు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ఈ సినిమా మీకోసమే చేశాను. మీరు గర్వపడేలా చేస్తానని హామీ ఇస్తున్నాను' అని రాసుకొచ్చారు. అశోక్ గల్లా కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. ఈ సినిమాలోని రెండో పాటను కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. 'జై బోలో కృష్ణ' అంటూ సాగే ఈ పాటను ఆయనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

# చైత్ర స్విమ్ షూట్ ఫోటోలు


రక్షిత్ శెట్టి హీరోగా నటించిన సప్త సరాగాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ చైత్ర జే అచర్. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ తాజాగా షేర్ చేసిన ఫొటోలు నెట్టింట సెగలు రేపుతున్నాయి. స్విమ్ షూట్‌లో స్విమ్మింగ్ పూల్‌లో దిగిన ఈ భామ నీటిలో తడిసిముద్దయింది. కాటుక కండ్లతో మత్తెక్కించే హావభావాలతో హాళయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. త్వరలోనే స్విమ్మింగ్ నేర్చుకుంటా. కానీ అప్పటివరకు ఇలా మెస్మరైజింగ్ పోజులతో మేనేజ్ చేస్తానంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చింది. ఈ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.






# కథాకథనం లోపించిన ..గ్యాంగ్ ఆఫ్ గోదావరి

కొన్ని నెలలుగా మూతపడిన థియేటర్ల తలుపులు మళ్లీ తెరచుకునేలా ఈ వారం మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. అందులో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి ఒకటి. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి రావడం... విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన సినిమా కావడంతో విడుదలకి ముందే సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. రచయిత కృష్ణచైతన్య దర్శకత్వం వహించడంతోపాటు... ప్రచార చిత్రాలూ ప్రేక్షకుల్ని ప్రత్యేకంగా ఆకర్షించాయి. ఎదగడం మన హక్కు అని నమ్మిన ఓ యువకుడు లంకల రత్నాకర్ (విష్వక్ సేన్). తండ్రి చెప్పిన ఆ మాటని చిన్నప్పుడే బాగా ఒంటబట్టించుకుంటాడు. తనలోని మనిషిని పక్కనపెట్టి, ఎదుటివాళ్లని వాడుకోవడమే పనిగా పెట్టుకుంటాడు. చిన్నచిన్న దొంగతనాలు చేసే రత్నాకర్ ... స్థానిక ఎమ్మెల్యే దొరసామి (గోపరాజు రమణ)కి కుడిభుజంగా మారతాడు. దొరసామి, నానాజీల మధ్య నడుస్తున్న రాజకీయ వైరంలోకీ తలదూర్చుతాడు. ఆ రాజకీయం అతన్ని ఎక్కడిదాకా తీసుకెళ్లింది? అతను కోరుకున్నట్టు ఎదిగాడా, లేదా? లంకల్లోని పగ అతన్ని ఎలా వెంటాడింది? బుజ్జి(నేహాశెట్టి), రత్నమాల (అంజలి)లతో రత్నాకర్‌కు ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాలు ..ఇందులో ఉన్నాయి. గోదావరి నేపథ్యంలో సినిమా అనగానే పచ్చటి పల్లెసీమలు, ప్రశాంతమైన వాతావరణమే గుర్తొస్తుంది. ఇప్పటివరకు మన సినిమాల్లో ఎక్కువగా చూపించింది అదే. కృష్ణచైతన్య మాత్రం కాస్త భిన్నంగా ఎరుపెక్కిన గోదావరిని ఈ సినిమాలో చూపించారు. అక్కడి రాజకీయాలు, ఆధిపత్య పోరు, లంక గ్రామాల్లోని పగ, ప్రతీకారాలతో ఓ యువకుడి ప్రయాణాన్ని ముడిపెడుతూ కథని మలిచారు. అక్కడక్కడా రంగస్థలం ఛాయలు కనిపించే ఈ కథ పరిధి గోదావరి అంతా విస్తృతంగానే వుంటుంది. ప్రతీ పాత్రకీ దానిదైన ఓ ప్రయాణంతో స్క్రిప్ట్‌ని రాసుకున్నాడు దర్శకుడు. కానీ విష్వక్‌సేన్, అంజలి పాత్రలు మినహా మిగతా ఏ పాత్రలూ ప్రభావం చూపించవు. గాఢత, భావోద్వేగాలే ఇలాంటి కథలకు బలం. కానీ ఇందులో చాలా సన్నివేశాలు మరీ ఎక్కువ నాటకీయతతో సాగడం.. ప్రతినాయకుడి పాత్రల్లో బలం లేకపోవడం.. కథానాయిక నేహాశెట్టి పాత్ర కూడా పెద్దగా ప్రభావం చూపించేలా లేకపోవడంతో ఆశించిన భావోద్వేగాలు పండలేదు. రాజకీయ క్రీడలో భాగంగా కథానాయకుడు వేసే ఎత్తులు పైఎత్తులు చాలానే ఉంటాయి. వాటిని మరింత ఉత్కంఠభరితంగా తెరకెక్కిస్తే బాగుండేది. ఇంత గాఢమైన కథని, నేపథ్యాన్ని ఆవిష్కరిస్తున్నపుడు ప్రతినాయకుల్ని మరీ అంత బలహీనంగా చూపించడం కథకు ఏమాత్రం అతకలేదు. లంక గ్రామాల్లో కత్తి పట్టే సంప్రదాయంతో సన్నివేశాల్ని మొదలుపెట్టిన దర్శకుడు వేగంగానే కథా ప్రపంచంలోకి తీసుకెళ్లారు. కథానాయకుడిని మాస్‌గా ఆవిష్కరించిన తీరు, పోరాటాలు, అంజలి పాత్ర ప్రయాణం ప్రథమార్థానికి ఆకర్షణగా నిలుస్తాయి. కథానాయకుడి పాత్రలో మాస్ కోణం, అతని వ్యక్తిత్వం వరకూ సమస్యలేమీ లేకపోయినా... ఆ పాత్ర ఎదుగుదల చూపెట్టిన తీరే మరీ సినిమాటిక్‌గా అనిపిస్తుంది. ఓ ఎమ్మెల్యేని కిడ్నాప్ చేయడం, మరో ఎమ్మెల్యేని చంపి నదిలోకి విసిరేయడం వంటి సన్నివేశాలే అందుకు ఉదాహరణ. ద్వితీయార్థం సినిమాలో నదిలో సాగే ఓ సన్నివేశం బాగుంది. చివర్లో తండ్రీ, కూతుళ్ల బంధం నేపథ్యంలో భావోద్వేగాల్ని పండించే ప్రయత్నం చేసినా అదేమీ ప్రభావం



# తమిళంలో బిజీగా నటి కీర్తి సురేశ్

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నేను శైలజతో తెలుగు ఇండస్ట్రీలోకికి ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇక గత ఏడాది దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చేసి వరుసగా తమిళంతో పాటు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే హిందీ నటుడు వరుణ్ ధావన్‌తో ఒక సినిమా చేస్తున్న ఈ భామ తాజాగా 'రఘు తాతా' అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమాకు సుమన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి రీసెంట్‌గా టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ విడుదల తేదీని అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సినిమాను స్వాతంత్య్ర దినోత్సవం కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అదే రోజు తెలుగులో అల్లు అర్జున్ పుష్ప విడుదల కానుంది. దీంతో ఆగష్ట్ 15న రెండు పెద్ద సినిమాలు పోటి పడనున్నట్లు తెలుస్తుంది. ఇక రఘు తాతా టీజర్ చూస్తే.. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ లో క్యాడెట్ శిక్షణ పొందుతున్న కీర్తి సురేష్ పాత్రతో టీజర్ ప్రారంభమవుతుంది. అయితే ఔఅఅ మాస్టర్ హిందీలో శిక్షణ ఇస్తుండగా.. నాకు హిందీ రాదు తమిళంలో చెప్పండి సార్ అంటూ కీర్తి సురేష్ చెబుతుంది. దీంతో ఈ చిత్రం తమిళ ప్రజలపై హిందీని రుద్దడం చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. ఒక సన్నివేశంలో హిందీ పరీక్ష రాస్తేనే ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుంది అంటే దానిని కీర్తి సురేష్ తిరస్కరించడం చూడవచ్చు. 'సలార్' తో సక్సెస్ అందుకున్న హోంబలే ఫిల్మ్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, దేవదర్శిని, రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. షాన్ రోల్డన్ ఈ చిత్రానికి సంగీతం

# దేవకీ నందన వాసుదేవ నుంచి సాంగ్ రిలీజ్




టాలీవుడ్ యాక్టర్ అశోక్ గల్లా కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా దేవకీ నందన వాసుదేవ. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాల డైరెక్ట్ చేస్తున్నాడు. 2 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీ నుంచి ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం సెకండ్ సింగిల్ జై బోలో కృష్ణ సాంగ్ లాంఛ్ చేశారు. రఘురామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజిషన్‌లో స్వరాగ్ కీర్తన్ పాడాడు. ఈ మూవీకి జాంబిరెడ్డి ఫేం ప్రశాంత్ వర్మ కథనందిస్తున్నాడు. మేకర్స్ ఫస్ట్ యాక్షన్ వీడియోలో.. బురదలో జరిగ్గే÷ట్ సన్నివేశంతో కట్ చేసిన ఫస్ట్ యాక్షన్ సీక్వెన్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. యూనిక్ కథాంశంతో తెరకెక్కుతన్న ఈ సినిమాలో అశోక్ గల్లా మాస్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు డైరెక్టర్ టీజర్‌తో క్లారిటీ ఇచ్చేశాడు. ఈ మూవీని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ తెరకెక్కిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.